క్లుప్తంగా

నాడు-నేడు పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో రెండో విడత నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు.గురువారం ఆయన నాడు-నేడు పనులపై ఎంఈఓ, ఏఈలతో సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మొదటి విడతలో 27 పాఠశాలల్లో రూ. 5 కోట్ల పనులను పూర్తి చేశామన్నారు. రెండో విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

మోటారు స్టార్టర్ల చోరీ



ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పొలాల్లో బుధవారం రాత్రి విద్యుత్ మోటార్ల స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట పొలాల్లో చొరబడి 23 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు, స్టార్టర్లను అపహరించి వాటిని పగులగొట్టి, అందులోని విలువైన కాపర్‌ను చోరీచేశారు. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ధ్వంసమైన స్టార్టర్లను చూసి లబోదిబోమన్నారు. రైతులు ఎస్పీడీసీఎల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరశురామేశ్వర స్వామి సేవలో పీడీ మిశ్రా



పరశురామేశ్వర స్వామి ఆలయంలో పీడీ మిశ్రా

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాదు ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పీడీ మిశ్రా గురువారం పూజలు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. శాలువలు, పూలమాలలతో సన్మానించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

నైతిక విలువలతోనే స్వేచ్ఛ



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: నైతిక విలువలు పాటించినపుడే నిజమైన స్వేచ్ఛ అని ప్రిన్సిపల్ ఎం.శ్రీలత అన్నారు. పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జమాత్ ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటించాలన్నారు. అపుడే సముచిత గౌరవం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వర్మ, అధ్యాపకులు సతీష్ కుమార్, పరంధామయ్య, రోహిణి, సంక్రాంతి రాజేంద్రుడు, జమాత్ ఇస్లామి హింద్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి: విజయవాడ వరద బాధితులకు సీఎం సహాయనిధికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన కుమారుడు ఎస్సీవీ శ్రీకాంత్‌తో కలిసి అమరావతిలో సీఎం చంద్రబాబుకు రూ.10లక్షలు విరాళం అందజేశారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు గోగినేని భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, రవి పాల్గొన్నారు.

తిరుచ్చిపై 'సుందరరాజ'సం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసుందరరాజ స్వామి వారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరాభాద్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు శ్రీకృష్ణముఖ మండపంలో కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకారభూషితులైన దేవదేవేరులు తిరుచ్చిపై ఆశీనులై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

ప్రభుత్వ నిర్ణయంతో నిరుత్సాహం



ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ప్రైవేటు పరం చేయాలనే నిర్ణయం మమ్మల్ని నిరుత్సాహానికి గురి చేసింది. చిన్నప్పటి నుంచి ఎవరైనా ఏమి చదువుతావంటే డాక్టర్‌ను అవుతానన్న నాకు వైద్యవిద్య అందకుండా పోతుందేమోనని భయం కలుగుతోంది. ఎంత బాగా చదివినా కళాశాలలు ప్రైవేటు పరం అయితే మేనేజ్‌మెంట్ కోటా డబ్బులు కట్టే స్థోమతే మాకు లేదు. ప్రభుత్వం పునరాలోచించి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి.

– యు.గీతికే, బైపీసీ విద్యార్థిని, సీనియర్ ఇంటర్, శ్రీకాళహస్తి



ప్రభుత్వం పునరాలోచించాలి



మాది వ్యవసాయ కుటుంబం. నా తల్లిదండ్రుల కోరికి మేరకు నేను డాక్టర్ కావాలని బైపీసీలో చేర్పించారు. మొదటి సంవత్సరం 400 మార్కులు వచ్చాయి. అయితే మేము నీట్ రాసే సమయానికి 13 కళాశాలలు ప్రారంభం అవుతాయని అనుకున్నాం. మాకు అవకాశం వస్తుందని ఆశపడ్డాం. అయితే అవన్నీ ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బాధ కలిగించింది. పునరాలోచించి విద్యార్థులకు మంచి జరిగేలా చూడాలని కోరుతున్నాం.

– కె.లక్ష్మీదీపక్, బైపీసీ విద్యార్థి, సీనియర్ ఇంటర్, శ్రీకాళహస్తి

చెత్త కాదు.. మత్తు సంపద కేంద్రాలు

- నిరుపయోగంగా బృందావనాలు
- అసాంఘిక కార్యక్రమాలకు నెలవు
- తంతుగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

గ్రీన్ అంబాసిడర్లకు నెల నెలా అందని వేతనం.. గడవని జీవనం.. చెత్త సేకరణ జరిగినా సంపద కేంద్రానికి తరలని వైనం .. వెరసి.. మద్యపాన ప్రియులు, పేకాటరాయుళ్లకు ఆవాసంగా మారి.. చెత్త నుంచి సంపద సృష్టించాల్సిన కేంద్రాలు.. మత్తు సంపదకు నిలయాలుగా మారుతున్నాయి. పంచాయతీల్లో నిర్మించిన బృందావనాలు ఆరంభించిన కొన్నాళ్లకే నిరుపయోగంగా మారాయి. అయినా నేడు స్వచ్ఛతా హీ సేవ పేరుతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిన బృందావనాలపై కథనం.

నారాయణవనం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను జోరుగా నిర్వహించి, ఒక తంతుగా పూర్తి చేస్తున్న అధికారులు, చెత్త నుంచి కంపోస్టు ఎరువు తయారు చేసి, సంపద సృషించే కేంద్రాలైన బృందావనాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీంతో బృందావనాలు మందుబాబులకు, పేకాటరాయుళ్లకు ఆవాసాలుగా మారాయి. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఇంటింటా వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయడానికి ప్రతి పంచాయతీలో బృందావనాలను (సంపద కేంద్రాలు) ఏర్పాటు చేశారు.

వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీకి తొట్లు, షెడ్లను నిర్మించారు. ప్రారంభంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆడంబరంగా ప్రారంభమైన సంపద కేంద్రాలు మూతపడి, నిరుపయోగంగా ఉన్నాయి.

ఆశయం ఉన్నతం..ఆచరణే శూన్యం

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ చెత్తను ఇంటింటా నేరుగా సేకరించి, వర్మీకంపోస్ట్ ఎరువుగా మార్చి విక్రయించడంతో పంచాయతీల ఆదాయాన్ని పెంచే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్‌ను ఏర్పాటు చేసి, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక్కో వర్మీకంపోస్ట్ ఎరువుల తయారీ కోసం సంపదకేంద్రాలను నిర్మించింది. ఇంటింటా చెత్త సేకరణకు రెండేసి బుట్టలను ఉచితంగా ఇస్తూ, గ్రీన్ అంబాసిటర్లను నియమించి, ట్రై సైకిళ్లను అందజేశారు. ప్రారంభంలో సజావుగా సాగినా.. కాలక్రమంలో ఈ పథకం పడకేసింది.



మద్యం బాటిళ్లతో నిండిన కంపోస్ట్ తొట్టి

అందని జీతాలు

చెత్త సేకరణకు, కంపోస్ట్ ఎరువుల తయారీకి నియమించుకున్న గ్రీన్ అంబాసిడర్లకు నెల నెలా వేతనం శాపంగా మారింది. చేస్తున్న పనికి వేతనం అందితే ఉత్సాహంగా కార్మికులు పనిచేస్తారు. ఆరు నెలలకొకసారి జీతాలు రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. దీంతో చేసే పనిపై శ్రద్ధ చూపకపోవడంతో సేకరించిన చెత్తను గ్రామ పొలిమేరల్లో వేయడంతో ఊరళ్లకు దూరంగా ఉన్న సంపద కేంద్రాలు మూతపడ్డాయి.

అసాంఘిక కార్యక్రమాల నిలయాలుగా..

మద్యపాన ప్రియులు, పేకాటరాయుళ్లకు సంపద కేంద్రాలు అనుకూలంగా మారాయి. ఈ నేపథ్యంలో సిగరెట్ పీకలు, ఖాళీ మద్యం బాటిళ్లతో సంపద కేంద్రాలు నిండిపోయాయి. పూర్తిగా నిఘా కొరవడంతో యువత పెడదారిన పడుతుందని పలువురు వాపోతున్నారు. సేకరించిన ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను రీసైక్లింగ్‌కు అనువుగా మార్చే రూ.లక్షల విలువైన యంత్రాలు తుప్పుపట్టే స్థితికి చేరుకున్నాయి.



శిథిలావస్థలో అరణ్య కండ్రిగ బృందావనం



తిరువట్యంలో పిచ్చి మొక్కలతో నిండిన బృందావనం

వినియోగంలోకి తీసుకొస్తాం

గ్రామ పంచాయతీల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి బృందావనాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. కార్మికుల అవసరాలకు పంచాయతీల నుంచి అడ్వాన్స్‌లు ఇప్పించడానికి కృషి చేస్తాం. సంపద కేంద్రాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పంచాయతీ కార్యదర్శులు పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

–డాక్టర్ వేణయ్య, ఈఓపీఆర్డీ, నారాయణవనం

ఆలయంలో పసుపుదారాల దందా



పసుపుదారాలు కడుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమపం లోని భద్రకాళీ సమేత వీర భద్రస్వామి ఆలయం వద్ద పసుపుదారలు చెట్టుకు కడితే సర్వదోషాలు పోతాయని నమ్మించి ఆలయానికి సంబంధం లేని ఓ పూజారి మోసం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆలయం వద్ద ప్రసాద్ అనే పూజారి విధులు నిర్వహిస్తుండగా ఉదయం 3 గంటల నుంచి ఆలయానికి సబంధం లేని ఓ పూజారి అక్కడ కూర్చుని పసుపుదారాలు, నేతిదీపాలు అమ్మేవారితో కుమ్మక్కై ఆలయం పరిసరాల్లో నిద్ర చేస్తున్న వారిని నిద్ర లేపి మరీ పసుపుదారాలు, నేతి దీపాలు అంటగట్టి అవి కడితే సర్వదోషాలు పోతాయని నమ్మబలుకుతున్నారు. దీపాలను పసుపుకుంకుమ ప్యాకెట్లు, పసుపుదారం అంటగట్టి భక్తుల నుంచి రూ.250 దోచుకుంటున్నారు. ఈ పూజ చేసినందుకు రూ.101 ఇవ్వాలని ఆ దొంగస్వామి భక్తుల నుంచి అడిగి మరీ తీసుకుంటున్నాడు. ఇంత జరుగుతున్నా ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, హోంగార్డులు ఎవరికీ తెలియకపోవడం శోచనీయం . అయితే ఇక్కడవచ్చే డబ్బులను అందరూ పంచుకుంటున్నారని, అందుకే వారిని అలా వదిలేశారని ఆరోపణలు ఉన్నాయి.

బాధ్యతగా పరిసరాలశుభ్రత

బుచ్చినాయుడుకండ్రిగ: పరిసరాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ స్వప్న, కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. గురువారం కంచనపుత్తూరులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత హీ సేవ కొనసాగుతుందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం

- కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు
- వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్

నారాయణవనం: కూటమి ప్రభుత్వం వందరోజులుగా ప్రజలను వంచిస్తోందని, సూపర్ సిక్స్ పథకాలను ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చి మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ మండిపడ్డారు. గురువారం నారాయణవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు, ఓట్ల కోసం ప్రజలను సూపర్ సిక్స్ పథకాలంటూ మభ్యపెటివ్ట ఇప్పుడు అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. వందరోజుల పాలనతో సంబరపడిపోతున్న సీఎం చంద్రబాబుకు హామీలు మాత్రం గుర్తురావడం లేదని ఎద్దేవా చేశారు. 100శాతం హామీలను అమలు చేసిన జగనన్న విమర్శిస్తూ కాలం గడిపేస్తున్నారని ఆరోపించారు. కోవిడ్ సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయినా, జగనన్న మాత్రం సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేశారని కొనియాడారు. జగనన్న అన్ని పథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందించారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయలేక ఎదురుదాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద రోజుల పాలనలో మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణ, సచివాలయాల నిర్వీర్యం, మద్యం పాలసీ పేరుతో సొంతవారికి అప్పగించడం , ప్రజల కోసం పనిచేసిన అధికారులను వేధించడం తప్ప కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బ్రాహ్మణతాంగాళ్ వడ్డీ ఇళ్ల నివాసి బాలాజీ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే కీళగరం దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాజా కుమారుడు కిరణ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నేతలు అన్నాదొరై, రాకేష్ కిరణ్ పాల్గొన్నారు.



బాలాజీ కుటుంబీకులను పరామర్శిస్తున్న రాజేష్

ఘనంగా 'రాక్‌వర్త్' వార్షికోత్సవం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ 13వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ కుమార్ సింగ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ రాయన, ఇతర సిబ్బంది సమక్షంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. శైలేష్ కుమార్ మాట్లాడుతూ సిబ్బంది అంకితభావం, కస్టమర్ల నమ్మకం, శ్రీసిటీ సహకారంతో రాక్‌వర్త్ ముందుకు సాగుతోందన్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రాక్‌వర్త్ 13వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం శ్రీసిటీ కమ్యూనిటీకి గర్వకారణమని వెల్లడించారు. అనంతరం 18 మంది కంపెనీ ఉద్యోగుల పిల్లలకు విద్యాసాయం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. రూ. 20వేల కంటే తక్కువ జీతం కలిగి ఉన్న ఉద్యోగుల పిల్లలకు స్కూళ్లు, కళాశాలల ఫీజులను పూర్తిగా కంపెనీ చెల్లిస్తుందని పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరంలో 100 మంది పిల్లలకు దీన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీసిటీ ఎండీ, రాక్‌వర్త్ పరిశ్రమ ప్రతినిధులు

పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, అపరిశుభ్రత వాతావరణంపై 'సాక్షి'లో పిచ్చి మొక్కల నడుమ ప్రభుత్వ కార్యాలయాలు శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ ప్రసాద్ స్పందించారు. గురువారం ఆయా కార్యాలయాల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపజేశారు.



ఎంపీడీఓ కార్యాలయం

చేతిపంపునకు మరమ్మతులు



అందుబాటులోకి వచ్చిన పంపు

బుచ్చినాయుడు కండ్రిగ : బీఎన్ కండ్రిగ తెలుగుగంగ కార్యాలయ ఆవరణలోని తాగునీటి చేతిపంపునకు గురువారం మరమ్మతు చేశారు. సోమవారం 'సాక్షి'లో చేతిపంపునకు మరమ్మతులు చేపట్టండి శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా స్పందించారు. బోరు మెకానిక్ సుబ్రమణ్యంతో చేతిపంపునకు దెబ్బతిన్న పైపుల స్థానంలో కొత్తవి వేయించారు. తాగునీటి సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



పాపానాయుడుపేటలో ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఏర్పేడు: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. ఏర్పేడులో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. రోడ్లు, కాల్వలు పక్కన విచ్చలవిడిగా కోళ్ల కోబరాలు, చెత్త చెదారాలను వేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని చెప్పారు. అనంతరం పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు



2కే రన్‌కు హాజరైన యువత

శ్రీకాళహస్తి: మత్తుకు యువత బానిసలు కావద్దని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని ది స్కూల్ ఆవరణం నుంచి 2కే రన్‌ను డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసలు అయితే జీవితాలు నాశనమవుతాయన్నారు. దీంతో కుటుంబాలు వీధిన పడుతాయని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. వన్‌వే, వన్‌సైడ్ పార్కింగ్, హెల్మెట్‌ధారణ, సీటు బెల్టు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం వీఎంసీ సర్కిల్ మీదుగా శ్రీకాళహస్తీశ్వరాలయం, పొన్నాలమ్మ ఆలయం, స్కిట్ కళాశాల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ప్రజలు, ప్రముఖులు, పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి రక్తదానం

ఏర్పేడు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు గుమ్మడి మురళి గురువారం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని మన్నసముద్రానికి చెందిన ఉపాధ్యాయుడు మురళి తోటి ఉపాధ్యాయుని సోదరుడు నానికి ఆపరేషన్ కోసం అత్యవసరంగా రక్తం కావాల్సి వచ్చింది. వెంటనే స్పందించిన ఉపాధ్యాయుడు తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటి వరకు 17 సార్లు రక్తదానం చేసినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం

శ్రీకాళహస్తి: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. పలుమార్లు ఆర్డీవోకు విన్నవించినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ భూములను కొనుగోలుకు ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తులసీరాజన్, మించల శివకుమార్, మోహన్ రెడ్డి, రొద్ద గోపి, శ్రీనివాసులు, మురళి, అయ్యప్ప, గురవయ్య, మునిచందు, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

మా గ్రామనత్తం మాకే కావాలి

రేణిగుంట: మండలంలోని ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాల సమీపంలో తిరుపతి అనంత ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు జేసీబీతో స్థలాన్ని చదును చేస్తుండగా, గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికుల కథనం మేరకు, ఆర్.అగ్రహారంలో మొత్తం 2.38 ఎకరాల స్థలాన్ని 2016లో అప్పటి ప్రభుత్వం నుంచి సుమారు రూ.60లక్షలకు అనంత ఎడ్యుకేషనల్ సొసైటీ న్యాయ కళాశాల స్థాపన నిమిత్తం కొనుగోలు చేసింది. అయితే అప్పటి నుంచి అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో గ్రామస్తులు గ్రామనత్తంగా భావించి గ్రామ భవిష్యత్తు అవసరాల కోసం ఆ స్థలం దురాక్రమణకు కాకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. హఠాత్తుగా బుధవారం మండల సర్వేయర్ సురేష్ ఈ స్థలంలో సర్వే చేసి తమకు సరిహద్దులు చూపారని, దీంతో గురువారం సొసైటీ కార్యదర్శి మహర్షి జేసీబీ సాయంతో స్థలం చదును చేయించి సరిహద్దు రాళ్లు నాటిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. 2016లో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఇన్నాళ్లూ ఏమి చేస్తున్నారని వారు నిలదీశారు. గ్రామ భవిష్యత్తు అవసరాలకు ఎలాంటి స్థలాలు లేవని, ఈ స్థలాన్ని వదలమని అన్నారు. దీంతో వారు పనులు ఆపేశారు.



అనంత ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు

కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ



రేణిగుంట సీఆర్‌ఎస్ గేటు సమావేశంలో ప్రసంగిస్తున్న శంకర్రావు

రేణిగుంట: కార్మికుల సంక్షేమం కోసం కొత్త చట్టాలు తీసుకొస్తున్నామన్న ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రంలో కార్మికుల చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి, కార్మికుల హక్కులను కాలరాశారని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ శంకర్రావు విమర్శించారు. రేణిగుంట రైల్వే క్యారేజీ రిపేర్ షాప్‌నకు చేరుకున్న ఆయన గురువారం యూనియన్ నాయకులతో కలసి గేట్ సమావేశంలో పాల్గొని కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీఆర్‌ఎస్ నార్త్ కాలనీ సౌత్ కాలనీలోని క్వార్టర్స్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. వర్క్ షాప్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తెలుసుకుని వాటి సమస్య పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు యూనియన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ సీఆర్‌ఎస్ బ్రాంచ్ అధ్యక్షుడు సదాశివరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేలో ప్రభుత్వం నూతనంగా ఉద్యోగులను తీసుకోకుండా కాంట్రాక్ట్ పద్ధతిలో శ్రమ దోపిడీ చేయిస్తోందన్నారు. ప్రధాన విభాగాల్లో ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేయడం దేశ భద్రతకు ప్రమాదకరమని హెచ్చరించారు. రైల్వే కార్మికుల భద్రత కోసం మజ్దూర్ యూనియన్ అనేక పోరాటాలు చేసిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ సభ్యులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే వర్క్ షాప్స్ డివిజనల్ కార్యదర్శి బుచ్చిరెడ్డి, బాబు, అధ్యక్షులు సదాశివరెడ్డి, ట్రెజరర్ ముని కుమార్, మజ్దూర్ యూనియన్ నాయకులు హెన్రీపాల్, మునిరాధయ్య, చంద్రశేఖర్, చంద్రనాయక్, దిలీప్, తిలక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.